

ప్రజావాణి ఫిర్యాదులను..

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు.

- 8లో ▸



స్కీం పేరుతో స్కాం

బహుమతుల ఆశ చూపి స్కీం పేరుతో రూ.4 కోట్ల వరకు స్కాం చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /19.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మున్సిపాలిటీల్లోకి 68 మంది కొత్త ఉద్యోగులు



నిజామాబాద్ సిటీ: జిల్లాలోని మున్సిపాలిటీల్లోకి 68 మంది కొత్త ఉద్యోగులు రానున్నారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల్లో విధులు నిర్వహించనున్నారు. వీరంతా గ్రూప్-4 పరీక్షలో ఎంపికయ్యారు. సోమవారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎస్ దిలీప్‌కుమార్‌కు రిపోర్టు చేశారు. వీరికి ఉద్యోగ బాధ్యతలు, విధి విధానాలు తదితర అంశాలపై కమిషనర్ దిలీప్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. 58 మంది మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లుగా, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లుగా, మరో 8 మంది జూనియర్ అకౌంటెంట్లుగా జాయిన్ కానున్నారు. అభ్యర్థులందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రం ఇవ్వనున్నట్లు తెలిసింది.


అడవుల నరికివేత ఆపాలి

- ఎఫ్‌ఆర్వో రాధిక



మోపాల్: అడవుల నరికివేతను ఆపి, సంరక్షణలో భాగస్వాములు కావాలని నిజామాబాద్ సౌత్ రేంజ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాధిక సూచించారు. సోమవారం ముదక్‌పల్లి సెక్షన్ పరిధిలోని సిర్‌పూర్ గ్రామపంచాయతీలో అడవికి నిప్పు - నివారణా చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రాధిక మాట్లాడుతూ అటవీ ప్రాంతాలకు నిప్పు పెడితే పర్యావరణానికి తీరని నష్టం చేకూర్చినవారవుతారని అన్నారు. అటవీ విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణం కలుషితమై ఆక్సిజన్ దొరకడం లేదన్నారు. అనంతరం సిర్‌పూర్ కోటను వారు సందర్శించారు. కోట చరిత్ర, పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. సదస్సులో సెక్షన్ ఆఫీసర్ బాసిత్, బీట్ ఆఫీసర్ సంయుక్త, అటవీ సిబ్బంది ఉదయ్, నాయకులు కెతడి నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్టీసీ ఆర్‌ఎం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎంగా జోత్స్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె సంగారెడ్డి నుంచి పదోన్నతిపై వచ్చారు. జోత్స్నకు సిబ్బంది పుష్ప గుచ్ఛం అందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జోత్స్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఎం) శంకర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఓ) ఎస్ సరస్వతి ఉన్నారు. కార్యాలయంలో ఆర్‌ఎం పరిధిలోని డిపో మేనేజర్లు ఆర్‌ఎం జోత్స్నను సన్మానించారు.

పసుపు బోర్డు కోసం..





తెలంగాణకు పసుపు బోర్డు ఇస్తూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటన చేయగా, ఇందూరు జిల్లాలోనే ఏర్పాటు చేస్తామని హోం మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. అయినప్పటికీ పసుపు బోర్డును మహారాష్ట్రకు తరలించుకుని వెళ్లేందుకు ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, నితిన్ గడ్కరీలు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎంపీ అర్వింద్ ఇందూరులోనే పసుపు బోర్డు ఏర్పాటు చేయించేందుకు ఢిల్లీలో పట్టు వదలకుండా కృషి చేస్తున్నారు.

- ఇందూరులోనే ఏర్పాటు చేయించేందుకు ఢిల్లీలో ఎంపీ అర్వింద్ పట్టువదలని కృషి
- ఇప్పటికే ప్రధాని అధికారిక ప్రకటన
- బోర్డును తరలించుకుపోయేందుకు మహారాష్ట్రకు చెందిన సీనియర్ కేంద్ర మంత్రుల ప్రయత్నాలు
- బోర్డు డైరెక్టర్ల నియామకానికి ఇప్పటికే కేంద్రం కసరత్తు
- పసుపు బోర్డు వస్తే జిల్లా నుంచే అంతర్జాతీయ ఎగుమతులు
- జిల్లాకు పసుపు శుద్ధి, కర్క్యుమిన్, ఆయిల్ పరిశ్రమలు తరలివచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పసుపు బోర్డు విషయంలో పట్టిన పట్టు విడువకుండా గట్టిగా కృషి చేసి చరిత్ర సృష్టించిన ఎంపీ ధర్మపురి అర్వింద్ మరిన్ని అడుగులు వేస్తున్నారు. తెలంగాణకు పసుపు బోర్డు ఇస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ప్రకటన చేయించారు. కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం గెజిట్ సైతం విడుదల చేసింది. తర్వాత కేంద్రంలో నంబర్‌టూ గా ఉన్న హోంమంత్రి అమిత్‌షాతో ఇందూరు జిల్లాలోనే ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయించారు. దేశంలో ఇప్పటివరకు స్పైసెస్ బోర్డు పరిధిలో ఒక పంటగా ఉన్న పసుపు పంటకు ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయించే విషయంలో అర్వింద్ ప్రత్యేకమైన ఘనత సాధించారు. అయితే పసుపు పంటకు సంబంధించి నిజామాబాద్ మార్కెట్‌తో పాటు సరిహద్దునే ఉన్న మహారాష్ట్రలో పేరెన్నిక గన్న సాంగ్లి మార్కెట్ సైతం అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగి ఉంది. మహారాష్ట్రలోని నాందేడ్, హింగోలి, సాంగ్లి, షోలాపూర్, కొల్హాపూర్ తదితర ప్రాంతాల్లో పసుపు పంటను బాగానే పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో పసుపు బోర్డును మహారాష్ట్రకు తరలించుకుని వెళ్లేందుకుగాను మహారాష్ట్రకే చెందిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఎంపీ అర్వింద్ ఏమాత్రం అవకాశమివ్వకుండా ఢిల్లీలో పట్టు వదలకుండా ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటు కోసం కృతనిశ్చయంతో ఉన్నారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో ఈ విషయమై ఇటీవలి కాలం వరకు సైలెంట్‌గా ఉన్న అర్వింద్ ప్రస్తుతం ఢిల్లీలో తీవ్ర కృషి చేస్తున్నారు.

తెలంగాణలో పసుపు దిగుబడి

సీజన్	సాగు (ఎకరాల్లో)	దిగుబడి (టన్నుల్లో)
2021-22	85,196	2,56,029
2022-23	56,073	1,67,092

చైర్మన్‌గా సీనియర్ నేత ?

పసుపు బోర్డు డైరెక్టర్లను నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. సీనియర్ నేతను చైర్మన్‌గా నియమించేందుకు ఆలోచన చేస్తున్నారు. డైరెక్టర్లుగా ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ట్రేడర్లను నియమించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రక్రియ మొదలు పెట్టింది. వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమల శాఖలు, ఆయుష్, ఫార్మాసూటికల్స్ విభాగాల నుంచి రొటేషన్ విధానంలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులను, పరిశోధనల్లో భాగసామ్యమయ్యే సంస్థలు, పసుపు రైతులు, ఎగుమతిదారుల ప్రతినిధులను సభ్యులుగా నియమించనున్నారు. పసుపు బోర్డు కార్యదర్శిని కేంద్ర వాణిజ్య శాఖ నియామకం చేయనుంది.



ఎంపీ అర్వింద్

■ మహారాష్ట్రలోని సాంగ్లి, తమిళనాడులోని ఈరోడ్‌లలో పెద్ద పసుపు మార్కెట్లు ఉన్నప్పటికీ నిజామాబాద్ పసుపు మార్కెట్ ప్రత్యేకంగా నిలుస్తోంది. అయితే సాంగ్లి మార్కెట్ నుంచి గట్టి పోటీ ఉండడంతో పాటు అక్కడి సీనియర్ కేంద్ర మంత్రులు బోర్డు కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఎంపీఅర్వింద్ పట్టువదలడం లేదు.

నిజామాబాద్‌లోనే 40 శాతం..

వివిధ రాష్ట్రాల ద్వారా 11.61 లక్షల టన్నుల పసుపు దిగుబడి వస్తోంది. 2022-23 సీజన్‌లో నిజామాబాద్ మార్కెట్‌కు 75 వేల టన్నుల పసుపు వచ్చింది. 2023-24 సీజన్‌లో నిజామాబాద్ మార్కెట్‌కు 70 వేల టన్నుల పసుపు వచ్చింది. రాష్ట్రంలోని మొత్తం పసుపు సాగులో 40 శాతం నిజామాబాద్ జిల్లాలోనే కావడం గమనార్హం. తరువాతి స్థానాల్లో జగిత్యాల, నిర్మల్, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలు ఉన్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్..

భారతీయ రైతులు పండించిన పసుపు పంటకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉంది. ఈ క్రమంలో భారత్ నుంచి ప్రతి ఏటా రూ.1,600 కోట్ల మేర పసుపు ఎగుమతులు జరుగుతున్నాయి. అంతర్జాతీయ పసుపు వాణిజ్యంలో భారత్ వాటా ప్రస్తుతం 62 శాతం ఉంది. అయితే ఈ పసుపు ఎగుమతుల వాణిజ్యాన్ని రూ.8,400 కోట్లకు పెంచాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది. దీనికి పసుపు బోర్డు ఎంతగానో ఉపయోగపడనుంది. బోర్డు ఏర్పాటైతే రాష్ట్రంలో ఏటేటా తగ్గుతూ వస్తున్న పసుపు పంట విస్తీర్ణం మళ్లీ పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తుంది. బోర్డు ఏర్పాటైతే జిల్లాకు పసుపు శుద్ధి కర్మాగారాలు, కర్క్యుమిన్ యూనిట్లు, కర్క్యుమిన్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్ట్ ఎగుమతి యూనిట్లు, వివిధ పసుపు ఆధారిత పరిశ్రమలు తరలివస్తాయి. అమెరికా, యూఏఈ, బంగ్లాదేశ్, మలేసియా దేశాల్లో భారత పసుపునకు డిమాండ్ ఉంది. బోర్డు ద్వారా భారతదేశం నుంచి అంతర్జాతీయ పసుపు వాణిజ్యం మరింత విస్తృతం అవుతుంది.

రైల్వే అభివృద్ధికి అదనపు కేటాయింపులు

సుభాష్‌నగర్: రాష్ట్రంలో రైల్వేలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి బడ్జెట్‌లో 20 శాతం (సుమారు రూ.1000 కోట్లు) పెంచి కేటాయింపులు చేశారని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో రైల్వే అభివృద్ధిపై లోక్‌సభలో తన ప్రశ్నకు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పై సమాధానం ఇచ్చారని ఎంపీ పేర్కొన్నారు. మోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం దశాబ్దకాలంలో తెలంగాణలో 650 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్ పనులు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ పాలనలో (2009-14 వరకు)లో 87 కిలోమీటర్ల పనులు మాత్రమే ప్రారంభించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనతో పోలిస్తే బీజేపీ హయాంలో 647 శాతం కొత్త రైల్వే ట్రాక్ పనులు ప్రారంభించిందని, మోదీ పాలనలో తెలంగాణ రైల్వేకు మహర్దశ పట్టిందని ఎంపీ అర్వింద్ అన్నారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్



మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

నిజామాబాద్‌అర్బన్: రానున్న వార్షిక పరీక్షలకు (2024 - 25 విద్యా సంవత్సరం) అధ్యాపకులు మిగిలిన 95 రోజులలో ప్రణాళిక బద్ధంగా బోధన చేసి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ అన్నారు. ఆయన నిజామాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో తరగతి గదులను, పరిసరాలను పరిశీలించారు. అధ్యాపకుల బోధన తీరు పై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. అధ్యాపకులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగ తరగతులు వెంటనే పూర్తి చేయాలన్నారు. విద్యార్జనలో వెనుకబడిన బడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కళాశాలలో పేద, బడుగు బలహీన, మైనారిటీ, విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని, మంచి విద్యా బోధన జరగాలన్నారు. కళాశాలలో లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్‌ల నిర్వహణ కోసం నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. సిలబస్ పూర్తి చేయడంతో పాటు అధ్యాపకులు మరోసారి రివిజన్ చేయాలన్నారు. ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ వహించాలన్నారు. కళాశాలకు ఆలస్యంగా వచ్చిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఫయిముద్దీన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

నిజామాబాద్ అర్బన్: ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణకు సంబంధించి కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఓఎంఆర్ ప్యాకింగ్ సంబంధిత వివరాలను వివరించారు.

చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ముందస్తుగానే పరీక్ష కేంద్రాలను పరిశీలించి అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా పరీక్ష సెంటర్ల గుర్తింపులో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ బి సత్యనారాయణ, వివిధ పరీక్ష కేంద్రాల ఆర్డినేటర్లు, రీజినల్ కోఆర్డినేటర్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, పాల్గొన్న అధికారులు

అట్టహాసంగా ఆరోగ్య ఉత్సవాలు

- జిల్లాకు కొత్తగా మరో ఎనిమిది 108 అంబులెన్సులు
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వెల్లడి



ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ తదితరులు

నిజామాబాద్‌నాగారం: ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ' ఆరోగ్య ఉత్సవాలు' కార్యక్రమం నిర్వహించారు. బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలను, మైత్రి ట్రాన్స్ క్లినిక్‌లను హైదరాబాద్ నుంచి మంత్రులు దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేంనరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి ఆరోగ్య ఉత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన తెలంగాణ సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వైద్యరంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అధికారం చేపట్టిన 48 గంటల వ్యవధిలోనే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామన్నారు.రూ. 2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేశామని, సంక్రాంతి తరువాత రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. జిల్లాకు కొత్తగా మరో ఎనిమిది 108 అంబులెన్సులు, అదే విధంగా 102 వాహనాలు రానున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్‌లు డాక్టర్ నాగమోహన్, డాక్టర్ జలగం తిరుపతిరావు, నాయకులు నగేష్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగో విడతా నిరాశే!

- అర్హత ఉన్నా అందని రుణమాఫీ
- రూ. రెండు లక్షల లోపు ఉన్నా మాఫీ కానీ వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు



మోర్తాడ్(బాల్కొండ)/ఇందల్వాయి: వివిధ కారణాలతో రూ.2 లక్షల లోపు రుణం మాఫీ కాని వారికి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి మాఫీ సొమ్మును మహబూబ్‌నగర్ వేదికగా విడుదల చేశారు. అయితే అనేక మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమకాకపోవడంతో తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గతంలో మూడు విడతల్లో 83,061 మంది రైతులకు రూ.626.49 కోట్లను విడుదల చేయగా నాలుగో విడతలో రూ.155.81 కోట్లను 17,551 మంది రైతులకు మంజూరు చేశారు. రుణ మాఫీ ఫలాలు అందుకోవాల్సిన రైతుల సంఖ్య 2లక్షల మందికి పైగానే ఉంటుందని అంచనా. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోను అనేక మంది రైతులు రుణమాఫీ ప్రయోజనం పొందలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి ఎదురవుతోంది. జిల్లాలో 39,285 మంది రైతులు రుణమాఫీ కోసం దరఖాస్తులు అందించారు. ఇదిలా ఉండగా దరఖాస్తుల్లో ఒకే కుటుంబం నుంచి ఒకటికి మించి దరఖాస్తులు వచ్చాయని, అలాంటి వారిని కలిపితే రెండు లక్షలకు మించి రుణం ఉన్న కేటగిరిలోకి వారు వెళ్లడంతో దరఖాస్తుల సంఖ్యకి లబ్ధిదారుల సంఖ్యకి తేడా ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.



ఆరెపల్లి గంగాప్రసాద్

■ మోర్తాడ్ మండలం సుంకెట్‌కు చెందిన రైతు ఆరెపల్లి గంగాప్రసాద్‌కు ఎస్‌బీఐలో రూ.50 వేల పంట రుణం ఉంది. గతంలో రెండు అకౌంట్‌లు ఒకే పేరు మీద ఉన్నాయనే కారణంతో రుణమాఫీ సొమ్ము సదరు రైతు గంగాప్రసాద్ ఖాతాలో జమ కాలేదు. నాలుగో విడతలో రుణమాఫీ సొమ్ము జమ అవుతుందని ఆశించిన గంగాప్రసాద్‌కు నిరాశే మిగిలింది. అలాగే ఇదే గ్రామానికి చెందిన సాయిరాంకు వేల్పూర్ మండలం రామన్నపేట్ దక్కన్ గ్రామీణ బ్యాంకులో రూ.2.45 లక్షల పంట రుణం ఉంది. అతనికి రూ.2 లక్షల రుణమాఫీ సొమ్ము జమ కావాల్సి ఉండగా ఎక్కువ రుణం ఉన్నందున మాఫీ సొమ్ము పొందడానికి అర్హత లభించలేదు. ఇలా గంగాప్రసాద్, సాయిరాంల మాదిరిగానే ఎంతో మంది రైతులకు రుణమాఫీ సొమ్ము ఖాతాల్లో జమ కాకపోవడంతో తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం మాట తప్పింది



రుణమాఫీ విషయంలో ప్రభుత్వం మాట తప్పింది. గతంలో ఏక కాలంలోనే రూ.2 లక్షల వరకు పంట రుణం మాఫీ అని ప్రకటించి ఇప్పుడు మాట మార్చడం ఎంత వరకు సమంజసం. ప్రభుత్వం రైతులను వంచించడం సరికాదు. వెంటనే రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయాలి.

– ఏనుగు రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

రూ.లక్ష రుణం

నేను దుబాయిలో ఉంటాను. పాస్‌బుక్ నా పేరు మీద, పంటరుణం నా భార్య పేరు మీద ఉండేది. కటాఫ్ తేదీ తర్వాతనే పంట రుణం చెల్లించాను. అర్హులమైన మాకు పంట రుణం అందలేదు. ఇకనైనా మాకు న్యాయం చేయాలి.

– పత్తిపాకల రాజేందర్, నల్లవెల్లి

ఒక్కరికి కూడా మాఫీ కాలేదు



మా కుటుంబంలో నేను, మా అమ్మ, నా భార్య పేరు మీద సిర్నాపల్లి ఇండియన్ బ్యాంకులో లక్షా తొంబై వేల పంట రుణం తీసుకున్నాం. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో మా పేర్లు లేవు. రెండు లక్షల లోపు ఉన్నా మాఫీ కాకపోవడంతో ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదు. అర్హులైన మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి. – తాళ్ల కిషన్, లింగాపూర్

రూ. 70 వేల రుణం



నాకు సిర్నాపల్లి ఇండియన్ బ్యాంకులో రూ. 70 వేల పంట రుణం ఉంది. రుణమాఫీ కాలేదు. వ్యవసాయ అధికారులకు అన్ని పత్రాలు అందించినా నిరాశే మిగిలింది. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నాను.

– బానవత్ సీల్‌సింగ్–కేకే తండా

రైతులు ఎదురు తిరుగుతారు



రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. రైతులు ఎదురు తిరుగుతారు. రైతులను మోసం చేసిన ఏ ప్రభుత్వం బతికి బట్ట కట్టలేదు. రైతులను మోసం చేయడం మానుకోవాలి. రుణమాఫీ నిధులు వెంటనే విడుదల చేసి మాటపై నిలబడాలి.

– మాదాం ప్రణీత్, రైతు, తొర్లి

రైతులు కంగారు పడొద్దు

రూ. రెండు లక్షల లోపు పంట రుణాలు ఉండి ఇంకా రుణమాఫీ కానీ రైతులు కంగారు పడవద్దు. అన్ని రకాల ధ్రువ పత్రాలతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను గానీ, మండల వ్యవసాయ అధికారులను గానీ సంప్రదించాలి. వారు మీ నుంచి దరఖాస్తులు స్వీకరించి వ్యవసాయ శాఖకు నివేదిక అందిస్తారు. అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారికి రుణమాఫీ అందేలా వ్యవసాయ శాఖ కృషి చేస్తుంది.

– ప్రదీప్ కుమార్, ఏడీఏ,నిజామాబాద్ రూరల్

క్లుప్తంగా

పీజీ పరీక్ష తేదీల్లో మార్పులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఇంటిగ్రేటెడ్‌ పీజీ (ఐదు సంవత్సరాల పీజీ కోర్సుల (ఏపీఈ, ఐపీసీహెచ్‌)కు సంబంధించి 5, 7, 9వ సెమిస్టర్‌ రెగ్యులర్‌, ఐఎంబీఏ 5వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల టైంటేబుల్‌లో మార్పులు చేసినట్లు కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్‌ 5 నుంచి 23వ తేదీ వరకు జరుగాల్సిన పరీక్షలను గ్రూప్‌ –2 పోటీ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల వినతి మేరకు డిసెంబర్‌ 17 నుంచి 28వరకు నిర్వహించనున్నట్లు కంట్రోలర్‌ తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ www.telanganauniversity.ac.in ను సంప్రదించాలని సూచించారు.

కబడ్డీ శిక్షణ శిబిరం ప్రారంభం



బాల్కొండ: ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న 71వ రాష్ట్ర స్థాయి ఉమెన్స్‌ కబడ్డీ చాంపియన్‌ షిప్‌లో పాల్గొనే జిల్లా మహిళా జట్టుకు శిక్షణ శిబిరాన్ని ముప్కాల్‌ ఇండోర్‌స్టేడియంలో కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు శిక్షణ శిబిరం ముప్కాల్‌లో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్‌, ముప్కాల్‌ స్పోర్ట్స్‌ అకాడమీ చైర్మన్‌ అంజయ్య, గంగారెడ్డి, సాయన్న, సంజీవ్‌, కనకయ్య, మోతె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సీఈవోగా సాయాగౌడ్‌



నిజామాబాద్‌ రూరల్‌: జిల్లా పరిషత్‌ ఇన్‌చార్జి సీఈవోగా డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్‌ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈవో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో సాయాగౌడ్‌కు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన సాయాగౌడ్‌కు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి
- అధికారులకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశం
- 80 ఫిర్యాదులు నమోదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌ అర్బన్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 80 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌, సహాయ కలెక్టర్‌ (ట్రైనీ) సంకేత్‌ కుమార్‌, డీఆర్‌వో సాయాగౌడ్‌, జెడ్పీ సీఈవో రాజేంద్రకుమార్‌, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌, నిజామాబాద్‌ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలను అందజేశారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు.

ఉద్యోగాలు ఇప్పించండి

61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులకు జీవో నంబర్‌ 81 ప్రకారం ఉద్యోగాలు ఇప్పించాలని డిమాండ్‌ చేస్తూ వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలిపారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందని, వెంటనే అమలు చేయాలన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి

నగరంలోని కాకతీయ స్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి శివజ్యోత్‌రెడ్డి మృతిపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

హామీలు అమలు చేయాలని..



నాయకులు సురేశ్‌, గంగాధర్‌, కిషన్‌, సాయన్న, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సుమారు అరగంట పాటు ఆందోళన ధర్నా కొనసాగింది.

సోయా కొనుగోలు చేయాలి



సోయా కొనుగోలు చేయాలని సాలూర మండలం హున్సా సహకార సంఘం పరిధిలోని రైతులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం సాలూరాలో కలెక్టరేట్‌ ఎదుట నిరసన తెలిపారు. పంట కోతలు పూర్తయి ఆరబోసి రెండు నెలలవుతున్నా ప్రభుత్వం సోయా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌ తరలి వచ్చిన వారిలో హున్సా, మందర్న, ఖజాపూర్‌ తదితర గ్రామాల రైతులు ఉన్నారు.

స్కీం పేరుతో స్కాం

- సామాన్యులకు రూ.4కోట్ల వరకు టోకరా
- ముఖం చాటేసిన స్కీం నిర్వాహకులు
- రెండేళ్లు గడిచినా బహుమతులు లేవు..
- డబ్బులు వాపస్‌ ఇవ్వడం లేదు
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు



దొన్కల్‌లో స్కీం బాధితులు

మోర్తాడ్‌(బాల్కొండ): మోర్తాడ్‌ మండలం దొన్కల్‌కు చెందిన దేవమ్మ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. తన ఇద్దరు మనవళ్లకు ఎంతో కొంత జమ చేయాలనే ఉద్దేశంతో ఒక స్కీంలో సభ్యురాలిగా చేరి నెలకు రూ.599 చొప్పున 15 నెలల పాటు రూ.8,985 జమ చేసింది. ఇద్దరు మనవళ్ల పేరు మీద ఆమె మొత్తం రూ.17,970 స్కీం నిర్వాహకులకు చెల్లించింది. స్కీం కాల పరిమితి ముగిసినా నిర్వాహకులు దేవమ్మకు బహుమతిని కానీ ఆమె జమ చేసిన డబ్బును కానీ వాపస్‌ చేయడం లేదు.

ఇదే గ్రామానికి చెందిన స్వరూప స్కీంలో సభ్యురాలిగా చేరి రూ.8,985 జమ చేసింది. ఆమెకు ఎలాంటి బహుమతిని ఇవ్వలేదు. ఇలా దేవమ్మ, స్వరూపే కాదు వేలాది మందిని స్కీం నిర్వాహకులు ముఖం చాటేశారు. నిజామాబాద్‌ కేంద్రంగా సాగిన ఈ స్కీంతో అనేక మంది మోసపోయారు. స్కీం కాల పరిమితి ముగిసి రెండేళ్లు గడిచినా సభ్యులకు బహుమతులు ఇవ్వకుండా, వారి డబ్బులు వాపసు చేయకుండా నిర్వాహకులు సతాయిస్తూనే ఉన్నారు.

4వేల మందికి పైగా రూ.4 కోట్ల వరకు స్కీం హకులకు చెల్లించారు. నామమాత్రంగానే బహుమతులను ఇచ్చి పెద్ద మొత్తంలో నగదును స్కీం నిర్వాహకులు నొక్కివేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కీం నిర్వాహకులలో ఒకరు పోలీసు ఉద్యోగి కొడుకు కావడంతో అతనిపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బాధితులు జంకుతున్నారని తెలుస్తోంది. గతంలోనూ దొన్కల్‌ కేంద్రంగా కొందరు రాజకీయ నాయకులు స్కీంను నిర్వహించి పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారు. ముందస్తు ఎన్నికలకు ముందు తమ పార్టీకి ఎక్కడ ముప్పు వస్తుందో అనే భయంతో కీలకమైన నాయకులు దొరవ తీసుకోవడంతో స్కీం సభ్యులకు సగంసగం డబ్బులను నిర్వాహకులు వాపస్‌ చేశారు.

ఇబ్బందుల్లో మధ్యవర్తులు

స్కీంలో సభ్యులను చేర్పించిన వారు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. సభ్యులను చేర్పిస్తే ప్రతి నెలా కమీషన్‌ ఇస్తామని నిర్వాహకులు నమ్మించడంతో చాలా మంది సభ్యులను చేర్పించడంతోపాటు వారే సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేశారు. స్కీం బాధితులు ఇప్పుడు తమను సభ్యులుగా చేర్పించిన వారిని పట్టుకున్నారు. దొన్కల్‌కు చెందిన బాధితులు ఇటీవల భీమ్‌గల్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ నవీన్‌కుమార్‌ను ఆశ్రయించారు.. ఆయన ఏజెంట్లుగా వ్యవహరించిన వారిని పిలిపించి స్కీం డబ్బులు వాపసు చేయాలని ఆదేశించారు. రోజువారి విధుల్లో బిజీగా మారడంతో మళ్లీ పోలీసులు దీనిపై దృష్టి సారించలేదు. కమ్మర్‌పల్లి కేంద్రంలో ఓ స్కీం నిర్వాహకులు ఇదే విధంగా ప్రజలను మోసం చేయడంతో బాధితులు తమను సభ్యులు చేర్పించిన వ్యక్తిపై ఒత్తిడి తీసుకువగా.. చివరకు పోలీసులను ఆశ్రయించడంతో ఎస్సై అనిల్‌రెడ్డి దొరవ తీసుకుని కొంత నగదు, కొన్ని టీవీలు, ఫ్రిజ్‌లు ఇప్పించారు. మరి కొంత నగదు, మరికొన్ని వస్తువులు ఇవ్వడానికి స్కీం నిర్వాహకులు గడువు కోరారు.

ఇరిగేషన్‌ ఎస్‌ఈపై సీఎంకు ఫిర్యాదు

నిజామాబాద్‌నాగారం: ఇరిగేషన్‌ సూపరింటెండెంట్‌పై ముఖ్యమంత్రి కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. విషయం ఆలస్యంగా వెలుగుచూసినా విచారణ పేరుతో అధికారులు కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు బాధితులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

నిజామాబాద్‌ ఈఎన్‌సీ పరిధిలో ఆర్మూర్‌, నిజామాబాద్‌ ఎస్‌ఈ కార్యాలయాలున్నాయి. అయితే ఆర్మూర్‌ ఎస్‌ఈ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్‌ ప్రాతిపదికన ప్రసాద్‌ అనే వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఎస్‌ఈ తనను అకారణంగా వేధించడంతోపాటు విధుల్లో నుంచి తొలగించాడని, ఉన్నతాధికారులతోపాటు సీఎం కార్యాలయంలో మే నెలలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో నిజామాబాద్‌ ఈఎన్‌సీ డివిజన్‌ ఎస్‌ఈకి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి విచారణ మూడు అడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతోందని, ప్రతి నెలా వేతనంలో నుంచి రూ.4వేల చొప్పున ఇవ్వాలని ఎస్‌ఈ తనను మానసికంగా వేధించాడని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై ఇరిగేషన్‌ ఈఎన్‌సీ మధుసూదన్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. శాఖలో జరిగే విచారణ విషయాలను మీడియాకు చెప్పాలి. ఎప్పుడు ఫిర్యాదు చేశారని, విచారణ పూర్తయ్యిందని ఓసారి, కాలేదని మరోసారి దాటవేసే ప్రయత్నం చేశారు.

ఉద్యోగులు కక్షగట్టి ఫిర్యాదు చేయించారు

మా డివిజన్‌లోని ఉద్యోగులు కావాలనే కక్షగట్టి నాపై ఫిర్యాదు చేయించారు. డ్రైవర్‌ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నా. నేను ఎవరి వద్ద డబ్బులు తీసుకోలేదు. కలెక్షన్‌ ఉంటాను కాబట్టే డ్రైవర్‌తో ఫిర్యాదు చేయించారు.

– యశస్విని, ఆర్మూర్‌ డివిజన్‌ ఎస్‌ఈ

జాతీయస్థాయి బీచ్‌ వాలీబాల్‌కు ఎంపిక



బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థి ఆకాశ్‌ బీచ్‌ వాలీబాల్‌ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఆకాశ్‌ను అధ్యాపకులు, సిబ్బంది సోమవారం అభినందించారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఆకాశ్‌ పాల్గొననున్నాడు. ప్రిన్సిపాల్‌ రజియొద్దీన్‌ ఈ సందర్భంగా ఆకాశ్‌కు రూ.వెయ్యి ప్రోత్సాహకం అందజేశారు.



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (20001–02బ్యాచ్‌) సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. మామిడిపల్లిలోని సాయి ఫంక్షన్‌ హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించగా, స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

తండ్రీకొడుకుల గంజాయి దందా

- తుని నుంచి ఆటోలో తరలింపు
- మహేశ్వరంలో పట్టుబడిన తొర్లికొండకు చెందిన నిందితులు
- 62 కిలోల గంజాయి, ఆటో, సెల్‌ఫోన్‌, రూ.10 వేల నగదు సీజ్‌
- కేసు వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: ఆంధ్రప్రదేశ్‌లోని తుని నుంచి నిజామాబాద్‌కు ఆటోలో గంజాయి తరలిస్తూ జిల్లాకు చెందిన తండ్రీకొడుకు మహేశ్వరం పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌ జిల్లా జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన ఆటో డ్రైవర్‌ మహ్మద్‌ మౌలానా మహారాష్ట్ర జిల్లా చింతపల్లికి చెందిన పెట్టిబాబు నుంచి ఆటోలో గంజాయి తీసుకొచ్చి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన ప్రకాశ్‌ అనే మహిళలకు అధిక ధరకు విక్రయించేవాడు. నవంబర్‌ 30వ తేదీన సాయంత్రం మౌలానా తన కుమారుడు మహ్మద్‌ ముస్తాఫాతో కలిసి తుని సమీపంలోని తాళ్లపాలెం వద్ద పెట్టిబాబు నుంచి 62.428 కిలోల(30 ప్యాకెట్లు) గంజాయిని రూ.2.10 లక్షలకు కొనుగోలు చేశాడు. ఆటో వెనుక భాగంలో ప్రత్యేకంగా తయారు చేయించిన ఫ్రేమ్‌లో గంజాయి ప్యాకెట్లు లోడ్‌ చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. రెగ్యులర్‌ రూట్‌లో వెళ్తే పోలీసు తనిఖీలుంటాయని మిర్యాలగూడ, దేవరకొండ, కల్వకుర్తి, మహేశ్వరం గేటు నుంచి శ్రీశైలం జాతీయ రహదారి, ఓఆర్‌ఆర్‌ మీదుగా నిజామాబాద్‌ వెళ్లాలనుకున్నారు. ఈ నెల 1వ తేదీన మధ్యాహ్నం 12గంటల సమయంలో కల్వకుర్తి నుంచి మహేశ్వరం గేటు వైపు ఆటోలో గంజాయి తరలిస్తున్న క్రమంలో పోలీసులకు అనుమానం వచ్చి ఫ్లైయింగ్‌ తనిఖీ చేశారు. ఆటోలో తరలిస్తున్న 62.428 కిలోల గంజాయి(30 ప్యాకెట్లు), టాటా ఏస్‌ ఆటో, మొబైల్‌ ఫోన్‌, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకుని మౌలానా, ముస్తాఫాను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మధుసూదన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

పరిస్థితి విషమించి మృతి



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని పేర్కిట్‌ సమీపంలో 63వ నంబర్‌ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హార్వెస్టర్‌ డ్రైవర్‌ గంగారాం సోమవారం మృతి చెందాడు. ఎస్సై కథనం ప్రకారం.. కరీంనగర్‌ నుంచి ఆర్మూర్‌వైపు వస్తున్న పాడి లారీ హార్వెస్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో హార్వెస్టర్‌ డ్రైవర్‌ గంగారాం, దానిపై ఉన్న విశాల్‌, జీత్‌ ఐవర్‌లారీ తీవ్రగాయాలయ్యాయి. నలుగురిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి గంగారాం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని పెర్కిట్‌లో కొనసాగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేయగా ఏడుగురు పట్టుబడ్డారని, వారి నుంచి రూ.47,700 నగదుతోపాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పీఎంపీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఎల్లారెడ్డి: సరైన పరిజ్ఞానం లేకుండా పీఎంపీ రవీందర్‌ ప్రజలకు వైద్యం చేస్తున్నాడని పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన కరణం సర్వోత్తం కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌కు సోమవారం ఫిర్యాదు చేసింది. మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న తనకు పీఎంపీ పెయిన్‌ కిల్లర్లు ఇచ్చాడని, అవి వాడడంతో శరీరమంతా బొబ్బలు ఏర్పడి ప్రాణాపాయ స్థితికి చేరానని తెలిపారు. పీఎంపీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత



కామారెడ్డి రూరల్‌: పట్టణంలోని ముదాంగల్లీలో నిల్వ ఉంచిన రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్‌ సప్లయిస్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డిప్యూటీ తహసీల్దార్‌ కిష్టయ్య తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ముదాంగల్లీకి చెందిన లావణ్య ఇంట్లో తనిఖీ చేయగా, 15 క్వింటాళ్ల బియ్యం పట్టుబడిందన్నారు. 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

ముగ్గురిపై చీటింగ్‌ కేసు

సిరికొండ: మండలంలోని ముషీర్‌నగర్‌ గ్రామానికి చెందిన మద్దికుంట ఆక్రిత్‌, మల్లయ్య, అజయ్‌పై చీటింగ్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌ రామ్‌ తెలిపారు. గ్రామానికి చెందిన జంగిలి గంగాధర్‌ కూతురు స్నేహను ఆక్రిత్‌ ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. పెళ్లి చేసుకోమని అడిగినా స్నేహకు చెప్పకుండా ఆక్రిత్‌ వారం రోజుల క్రితం గల్ఫ్‌కు వెళ్లిపోయాడు. ఆక్రిత్‌ పారిపోవడానికి అతడి తల్లి మల్లయ్య, అన్న అజయ్‌ సహకరించారని స్నేహ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ముగ్గురిపైన కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంబులెన్స్‌ డ్రైవర్‌పై డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసు



ఖలీల్‌వాడి: మద్యం సేవించి అంబులెన్స్‌ నడిపించిన డ్రైవర్‌ను ట్రాఫిక్‌ పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నగరంలోని అర్సపల్లి చౌరస్తా నుంచి డీఎస్‌ బాకెస్‌ చౌరస్తా వరకు సైరన్‌ ఆన్‌ చేసి డ్రైవర్‌ ఇసాక్‌ అంబులెన్స్‌ను వేగంగా నడిపించాడు. అంబులెన్స్‌లో పేషెంట్‌ లేకున్నా వేగంగా వెళ్లడంతో అనుమానం వచ్చి ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌, ఎస్సై సంజీవ్‌ వెంబడించి పట్టుకుని డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ టెస్ట్‌ చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. ట్రాఫిక్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

నవీపేట: భార్య కాపురానికి రావడం లేదని మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన మిణుగురు శివ(28) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన లావణ్యతో ఆరేళ్ల కిందట శివకు వివాహం కాగా, కుటుంబ కలహాల కారణంగా గత ఏడు నెలల క్రితం లావణ్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె తిరిగిరాకపోవడంతో మనస్తాపానికి గురైన శివ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యానికి బానిసై..

నిజామాబాద్‌ రూరల్‌: మద్యానికి బానిసై రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గూపన్‌పల్లికి చెందిన గంగాధర్‌(32) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో మహ్మద్‌ ఆరిఫ్‌ తెలిపారు. జీవనం గంగాధర్‌ తీవ్రంగా మద్యం సేవించడంతో తల్లిదండ్రులు గంగాధర్‌ను మందలించారు. దీంతో గంగాధర్‌ గడ్డి మందు సేవించగా ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సోమవారం మధ్యాహ్నం మృతుడు తన తల్లిదండ్రులతోపాటు భార్యను పొలానికి పంపించి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ప్రమాదవశాత్తు లారీ బోల్తా



బోల్తాపడిన లారీ



బోల్తాపడిన కారు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని గోపాల్‌పేట నుంచి బంజారు వెళ్లే రోడ్డులో నిర్మాణదశలో ఉన్న కల్వర్టు వద్ద ఆదివారం రాత్రి లారీ బోల్తా పడింది. గుంటూరు నుంచి పల్లీలోడ్‌తో మహారాష్ట్రలోని దుదియాకు వెళ్తున్న లారీ (ఏపీ 16 టీజీ 5839) ప్రమాదవశాత్తు బోల్తాపడడంతో, లారీ డ్రైవర్‌తోపాటు క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. నూతన వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రాంతంలో సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో లారీ బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డునిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలలో సరైన సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

చంద్రాయన్‌పల్లి శివారులో కారు..

ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి గ్రామ శివారులోని 44వ నంబర్‌ జాతీయ రహదారి పైనుంచి ఓ కారు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటన సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. కామారెడ్డి నుంచి నిజామాబాద్‌ వైపు వెళ్తున్న కారు ముందు టైరు పంక్చర్‌ కావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు క్షేమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

హైవేపై కారు దగ్ధం



హైవేపై దగ్ధమవుతున్న కారు



ఆర్మూర్‌లో దగ్ధమవుతున్న ఫాగింగ్‌ యంత్రం

మద్నూర్‌(జుక్కల్‌): మండల కేంద్రానికి సమీపంలోని ఎన్‌హెచ్‌ 161 సర్వీస్‌ రోడ్డుపై సోమవారం ప్రమాదవశాత్తు కారు దగ్ధమైందని స్థానికులు, ఫైర్‌ సిబ్బంది తెలిపారు. డోంగ్లీ మండలంలోని మారేపల్లికి చెందిన నలుగురు కారులో సిర్‌పూర్‌కు వెళ్తుండగా, మద్నూర్‌ సమీపంలోకి రాగానే కారు ఇంజిన్‌ నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. డ్రైవింగ్‌ చేస్తున్న వ్యక్తి అప్రమత్తమై కారు నిలిపివేసి అందులోని వారిని కిందికి దింపేయడంతో ప్రమాదం తప్పింది. ఫైర్‌ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కారులో ప్రయాణిస్తున్న వారు జహీరాబాద్‌ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌ బంధువులు అని తెలిసింది.

ఫాగింగ్‌మెషిన్‌కు మంటలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ఆరో వార్డు అన్నపూర్ణ కాలనీలో సోమవారం సాయంత్రం మున్సిపాలిటీకి చెందిన ఆటోలో దోమల నివారణకు ఫాగింగ్‌ చేస్తుండగా మంటలు చెలరేగాయి. ఫాగింగ్‌ యంత్రానికి మంటలు అంటుకోవడంతో డ్రైవర్‌ అప్రమత్తమై జనావాసాలకు దూరంగా ఆటోను తీసుకెళ్లి వదిలిపెట్టాడు. అనంతరం మంటలను సిబ్బంది ఆర్పివేశారు.

సాధారణ ప్రసవాలను పెంచాలి



రెంజల్‌(బోధన్‌): ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలను పెంచాలని ఆరోగ్య ఆయుష్మాన్‌ మందిర్‌ జిల్లా ప్రోగ్రాం అధికారి రాజాగౌడ్‌ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఆయన ఆస్పత్రిలో ప్రసవాలను పెంచేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. మండలం గురించి పరిశీలించారు. అంతకు ముందు తాడిబిలోని సబ్‌సెంటర్‌ను సందర్శించారు. రికార్డుల సక్రమంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి విశాలారాణి, క్వాలిటీ కంట్రోల్‌ మేనేజర్‌ రాము, ఆరోగ్య విస్తరణ అధికారులు ప్రవీణ్‌కుమార్‌, రవీందర్‌తోపాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాలికల జట్టు శిక్షణ శిబిరం



డిచ్‌పల్లి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(సుద్దపల్లి) క్రీడామైదానంలో స్కూల్‌ గేమ్స్‌ అండర్‌ –17 ఉమ్మడి జిల్లా బాలికల జట్టు శిక్షణ శిబిరాన్ని ప్రిన్సిపాల్‌ శిరీష నళిని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు ఆర్మూర్‌లోని జిల్లా పరిషత్‌ హైస్కూల్‌ (బాలుర) ఆర్మూర్‌ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్‌ గౌడ్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ స్వప్న, జిల్లా సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి మర్యాంటి గంగామోహన్‌, జిల్లా బేస్‌ బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్‌, వ్యాయామ ఉపాధ్యాయులు జోత్స్న, శ్రీలత, సాఫ్ట్‌ బాల్‌ అకాడమీ కోచ్‌లు మౌనిక, నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.